teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 166 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 13 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## తెలంగాణలో రాష్ట్రపతి పర్యటన

మినిస్టర్ ఇన్ వైటింగ్‌గా మంత్రి సీతక్క నియామకం
డిసెంబర్ 17 నుంచి 22 వరకు పర్యటించనున్న రాష్ట్రపతి
ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
భద్రతా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న పోలీసు శాఖ





## అఖండ-2 టికెట్ల ధరల పెంపు

"నాకు తెలియకుండానే జీవో వచ్చింది"
మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
హోం సెక్రటరీకి కీలక ఆదేశాలు జారీ

.. వివరాలు 2లో



## తీన్మార్ మల్లన్నపై హెచ్ఆర్‌సీలో ఫిర్యాదు

సాయి ఈశ్వరాచారి ఆత్మహత్యపై విచారణకు డిమాండ్
మల్లన్న ఆఫీస్ దృశ్యాలను బహిర్గతం చేయాలి
ఘటనను పక్కదారి పట్టిస్తున్నారని కమిషన్‌కు వినతి
యూట్యూబర్స్ పట్టు

.. వివరాలు 2లో



## రెండో దశ పంచాయతీ పోలింగ్‌కు
# సర్వం సిద్ధం

### రేపు 3,911 సర్పంచ్ స్థానాలకు ఎన్నిక

ఉదయం 7గం. నుంచి 1 గం. వరకు పోలింగ్
మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
ఇప్పటికే 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డులు ఏకగ్రీవం
మిగిలిన 3,911 స్థానాలకు 28 వేలకు పైగా అభ్యర్థులు పోటీ
తొలి విడత ఫలితాల్లో సత్తా చాటిన కాంగ్రెస్ అభ్యర్థులు
బీఆర్ఎస్‌కు 1,160, బీజేపీకి దారుణంగా 195 స్థానాలు

తెలంగాణ రాష్ట్రంలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియడంతో అధికారులు పోలింగ్‌కు సన్నద్ధమవుతున్నారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.




02

## 2027 జనాభా లెక్కలలో
# కుల గణన

జనాభా లెక్కలకు రూ. 11,718 కోట్ల బడ్జెట్ కు కేంద్రం ఆమోదం
రెండు దశల్లో జరగనున్న జనాభా లెక్కింపు




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): 2027 జనాభా లెక్కల కోసం 11,718 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. శుక్రవారం న్యూఢిల్లీలో మీడియాకు వివరణ ఇస్తూ సమాచార మరియు ప్రసార మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 2027 జనాభా లెక్కలను రెండు దశల్లో నిర్వహిస్తామని – మొదటి దశ మరియు రెండవ దశ అని మిగతా 2 లో

## కాంగ్రెస్ పతనం
# ఖాయం



ఇది ఆరంభం మాత్రమే
బీఆర్ఎస్‌దే ప్రత్యామ్నాయం
తొలిదశ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ విమర్శలు

02



## మెస్సీ మ్యాచ్‌కు
# భారీ బందోబస్తు

2500 మంది పోలీసులతో స్టేడియం పటిష్టం
పాసులకోసం మంత్రులు, ప్రముఖులు పైరవీలు
టికెట్లు ఉన్నవారికే అనుమతి.. లేనివారు రావొద్దు
రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడి

02


## పోలవరం ప్రాజెక్టుపై
# సుప్రీంకోర్టుకు తెలంగాణ

ప్రాజెక్టుపై ప్రభుత్వం అభ్యంతరాలు
సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుకు నిర్ణయం



02

# భోజనం వికటించి
## 44 మంది విద్యార్థులకు అస్వస్థత



ఆరుగురి పరిస్థితి విషమం
చందునాయక్‌తండా ఘటనపై కేసు, దర్యాప్తు ప్రారంభం

05



## సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావు లొంగుబాటు

వారం రోజుల కస్టోడియల్ విచారణకు కోర్టు అనుమతి
ఫిజికల్ టార్చర్ చేయకూడదని ప్రత్యేక ఆదేశం

02



## మత్తు మహమ్మారిని ఏరిపారేసేందుకు చర్యలు

- కొత్త బృందాల ఏర్పాటుకు సన్నాహాలు
- రౌడీషీటర్ల స్థాయి నిఘా ఇకపై నేరగాళ్లు, పెడ్లర్లపై కూడా
- డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికత వినియోగం
- కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలతో అత్యున్నత స్థాయి సమావేశం
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్




02

## సచివాలయంలో సోలార్
# పార్కింగ్‌కు ముహూర్తం ఖరారు

రూ. 17 కోట్లతో కార్‌పోర్ట్‌ల నిర్మాణం
ట్రెడ్కో, ఆర్అండ్‌బి శాఖలకు సంయుక్త బాధ్యతలు



# రెండో దశ పంచాయతీ పోలింగ్‌కు సర్వం సిద్ధం




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియడంతో అధికారులు పోలింగ్‌కు సన్నద్ధమవుతున్నారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ విడతలో ఇప్పటికే 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,911 సర్పంచ్ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది. ఈ స్థానాలకు దాదాపు 28,278 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. అనంతరం 2 గంటల నుంచి కౌంట్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇదిలా ఉండగా, ఇటీవల ముగిసిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. మొత్తం 3,834 సర్పంచ్, 27,600కు పైగా వార్డులకు జరిగిన తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అద్భుతమైన సత్తా చాటారు. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఏకంగా 2,872 స్థానాల్లో విజయం సాధించారు. పల్లెపోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని ప్రకటించినా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మద్దతుదారులు కేవలం 1,160 స్థానాల్లో మాత్రమే గెలుపొందారు. బీజేపీ మద్దతుదారులు దారుణంగా కేవలం 195 స్థానాలకే పరిమితమయ్యారు. 460 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయం సాధించారు. తొలి విడత ఎన్నికల సందర్భంగా, కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు, తొలి విడత ఫలితాల జోరుతో రెండో విడత పోలింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక మూడో విడత ఎన్నికలకు పోలింగ్ ఈనెల 17న జరుగనుంది.

# మెస్సీ మ్యాచ్‌కు భారీ బందోబస్తు

హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ ఆడనుండడంతో పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా తిలకించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, అధికారులు పోటీ పడుతున్నారు. అందుకోసం ఈవెంట్ నిర్వాహకులు ఇచ్చే పాసుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. తాజాగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడారు. మెస్సీ మ్యాచ్‌కు 2500 మంది పోలీసులకు భారీ భద్రత ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. టికెట్లు ఉన్నవారికే అనుమతి ఇస్తామని లేని వారు స్టేడియం వైపు రావొద్దని విజ్ఞప్తి చేశారు. స్టేడియం పరిసరాల్లో 34 చోట్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ మ్యాచ్‌కు దేశ వ్యాప్తంగా ప్రముఖులతో పాటు విదేశీయులు కూడా వస్తుండటంతో. అందరూ క్రమశిక్షణగా ఉండాలని కోరారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేయబోతున్నట్లు తెలిపారు. కాగా, ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో మెస్సీ ప్రత్యర్థి జట్టులో సీఎం రేవంత్ రెడ్డి ఆడనున్నారు. దీంతో ఆ మ్యాచ్‌కు ప్రత్యేకత సంతరించుకున్నది.

# సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావు లొంగుబాటు



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావుకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్‌లో పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సిట్ అధికారుల ఎదుట బేషరుతగా లొంగిపోవాలని ధర్మాసనం తెలిపింది. దీంతో ప్రభాకర్ రావు ఉదయం సరిగ్గా 10.30కి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో లొగిపోయారు. ఈ మేరకు ఆయనను సిట్ అధికారులు అదపులోకి తీసుకున్నారు. మరోవైపు గురువారం విచారణ సందర్భంగా ప్రభాకర్‌రావును వారం రోజుల పాటు కస్టోడియల్ విచారణకు కోర్టు అనుమతించింది. అయితే, ఆయనను ఫిజికల్ టార్చర్ చేయకూడదని దర్యాప్తు బృందానికి ధర్మాసనం ప్రత్యేకంగా సూచించింది. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు దర్యాప్తుకు ఏమాత్రం సహకరించడం లేదని సిట్ అధికారులు ఆరోపిస్తున్నారు. కేసుతో ముడిపడి ఉన్న ఐఫోన్‌కు సంబంధించి క్లౌడ్ ఖాతాల పాస్‌వర్డ్‌లను అన్నింటినీ రీసెట్ చేసి, సమాచారం ఇవ్వట్లేదని ఆయనపై అభియోగాలు మోపారు. దీంతో కేసులో అంతకు ముందు ఆయనకు ఇచ్చిన మధ్యంతర అరెస్ట్ నుంచి ఉపశమనాన్ని ఎత్తివేయాలని కోరుతూ సిట్ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు కోర్టు నిందితుడు ప్రభాకర్ రావును శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో బేషరతుగా లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది.

# పోలవరం ప్రాజెక్టుపై "సుప్రీంకోర్టుకు తెలంగాణ"

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో పోలవరం -బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. అయితే, ఆ లింక్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు కేంద్ర జలశక్తికి ఫిర్యాదు చేసింది. దీంతో ఏపీ సర్కార్ పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వెనక్కి తగ్గింది. అయితే, తాజాగా పోలవరం నీటిని బొల్లాపల్లి, నల్లమల సాగర్ జలాశయాలకు తరలించడమే లక్ష్యంగా పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు పేరును మార్చి పోలవరం-నల్లమల సాగర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి టెండర్లను ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఏపీ సర్కారు నిర్మించ తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ సాగునీటి ప్రాజెక్టుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో అభ్యంతరాలు దాఖలు చేయాలని నిర్ణయించిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కేసును వాదించాలని కోరినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పోలవరం-బనకచర్ల సుప్రీంకోర్టు కేసుపై సన్నాహక సమావేశం జరుగనుంది. మధ్యాహ్నం 2.30కి అభిషేక్ మను సింఘ్వీతో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ కానున్నారు.

# మత్తు మహమ్మారిని ఏరిపారేసేందుకు చర్యలు



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అత్యున్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తు మహమ్మారిని ఏరిపారేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై ఎటువంటి నిఘా ఉంచుతామో డ్రగ్స్ నేరగాళ్లు, పెడ్లర్లపైనా అదే స్థాయి నిఘా పెడుతున్నట్లు చెప్పారు. నగరంలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌కు చెక్ పెట్టేందుకు 'హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్' (హెచ్-న్యూ)ను మరింత బలోపేతం చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఉన్న బృందాలకు అదనంగా మరో నాలుగైదు కొత్త బృందాలను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్కరోజుతో ముగిసే ప్రక్రియ కాదని అది నిరంతర పోరాటమన్నారు. ఈ క్రమంలో అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఈ సమావేశంలో సూచించినట్లు తెలిపారు. ఇకపై ప్రతినెలా అన్ని ఏజెన్సీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, కేసుల పురోగతిని సమీక్షిస్తామని అన్నారు. డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తామని తెలిపారు. ఈ భేటీకి ఐబీ, డీఆర్ఐ, ఎన్‌సీబీ, ఎక్సైజ్, కౌంటర్ ఇంటెలిజెన్స్, ఈగల్, ఎఫ్ఆర్ఆర్‌వో తదితర అధికారులు హాజరయ్యారు.






# తీన్మార్ మల్లన్నపై హెచ్ఆర్‌సీలో ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కి శుక్రవారం పలువురు యూట్యూబ్ ఛానళ్ల నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. మల్లన్న ఆఫీస్ ముందు ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారి మరణంపై సమగ్ర విచారణ జరపాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈశ్వరాచారి మరణాన్ని బీసీ ఉద్యమానికి లింక్ పెట్టాలని చూస్తున్న మల్లన్నను విచారించాలని వినతిలో పేర్కొన్నారు. మల్లన్న ఆఫీసు లోపలి సీసీ ఫుటేజ్‌ను బయటపెట్టాలని యూట్యూబర్స్ డిమాండ్ చేశారు. ఈశ్వరాచారి మరణంపై కథనాలు ప్రసారం చేసిన యూట్యూబ్ ఛానల్స్ పై మల్లన్న తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని యూట్యూబర్స్ ఈ సందర్భంగా మండిపడ్డారు. కాగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలులో అన్యాయం జరిగిందని సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ దుర్ఘటనకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీసీ, దళిత, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# 2027 జనాభా లెక్కలలో కుల గణన

మొదటి పేజీ తరువాయి




అన్నారు. 2027 జనాభా లెక్కల శ్రేణిలో 16వది మరియు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వది అని ఆయన అన్నారు. భారతదేశ జనాభా లెక్కలను ప్రపంచంలోనే అతిపెద్ద పరిపాలనా మరియు గణాంక వ్యాయామంగా పరిగణిస్తున్నామని ఆయన అన్నారు. 2027 జనాభా లెక్కలలో కుల గణనను చేర్చనున్నారు. ఇది మొట్టమొదటి డిజిటల్ జనాభా లెక్కల సేకరణ అని శ్రీ వైష్ణవ్ అన్నారు. ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ వెర్షన్‌లకు అందుబాటులో ఉండే మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డేటాను సేకరిస్తారు. ఈ వ్యాయామంలో 30 లక్షల మంది ఫీల్డ్ ఫంక్షనరీలు పాల్గొంటారని శ్రీ వైష్ణవ్ చెప్పారు. 2027 జనాభా లెక్కింపు దేశంలోని మొత్తం జనాభాను కవర్ చేస్తుంది. ఈ ప్రక్రియలో ప్రతి ఇంటిని సందర్శించి, గృహాల జాబితా మరియు గృహ గణన మరియు జనాభా గణన కోసం ప్రత్యేక ప్రశ్నాపత్రాన్ని సేకరించడం జరుగుతుంది. బొగ్గు అనుసంధాన విధానం, కోల్‌సేటులో సంస్కరణలను క్యాబినెట్ ఆమోదించిందని మంత్రి ప్రకటించారు. బొగ్గు రంగంలో భారతదేశం ఆత్మనిర్భరత దిశగా అడుగులు వేస్తోందని ఆయన అన్నారు. 2016 నాన్-రెగ్యులేటెడ్ సెక్టార్ లింకేజ్ వేలం విధానంలో కోల్‌సేటు అనే ప్రత్యేక విండోను జోడించడం ద్వారా ఏదైనా పారిశ్రామిక ఉపయోగం మరియు ఎగుమతి కోసం దీర్ఘకాలిక ఉపయోగం కోసం వేలం ప్రాతిపదికన బొగ్గు అనుసంధానాలను కేటాయించడానికి ఈ విధానం అనుమతిస్తుంది, దీనిలో బొగ్గు అవసరమయ్యే ఏ దేశీయ కొనుగోలుదారుడైనా లింకేజ్ వేలంలో పాల్గొనవచ్చు. 2026 సీజన్‌కు కొబ్బరి కనీస మద్దతు ధర కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సాగుదారులకు లాభదాయకమైన ధరలను అందించడానికి, ప్రభుత్వం 2018-19 కేంద్ర బడ్జెట్‌లో అన్ని తప్పనిసరి పంటల ఎంఎస్పీ ని మొత్తం భారతదేశ సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు నిర్ణయించనున్నట్లు ప్రకటించింది.

# కాంగ్రెస్ పతనం ఖాయం




హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఇది ఆరంభం మాత్రమే, పంచాయతీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం రానున్న రోజుల్లో పాతాళానికి పడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా తొలి విడత సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై ఆసక్తికర ట్వీట్ చేశారు. తొలిదశ పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా హోరా హోరీగా పోరాడి సర్పంచులుగా, వార్డుమెంబర్లుగా గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచకపర్వాన్ని ఎదుర్కొని నిలబడిన గులాబీ సైనికులందరికీ ప్రత్యేకంగా అభినందనలు అంటూ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే పంచాయతీ ఎన్నికల కోసం జిల్లాల పర్యటనల పేరిట ప్రచారం చేసినా, పోటీ చేసిన చోట కనీసం 44 శాతం సీట్లను కాంగ్రెస్ దాటకపోవడం ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగినప్పటికీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాలతో రుజువై పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇక ప్రత్యామ్నాయం కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని, బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని కూడా తొలిదశ పంచాయతీ ఫలితాలు కుండబద్దలు కొట్టి చెప్పాయని అన్నారు. వచ్చే మూడేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా పల్లెల్లో పైసా అభివృద్ధి పని జరగదని, గ్రామస్థులు నిర్ధారణకు రావడం వల్లే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇంతటి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని వెల్లడించారు. సగం స్థానాలు కూడా కాంగ్రెస్ గెలవకపోవడం, అనేక చోట్ల 10, 20 ఓట్ల తేడాతోనే బయటపడటం చూస్తే కాంగ్రెస్ కు కౌంట్ డౌన్ పల్లెల నుంచే ప్రారంభమైనట్టు స్పష్టంగా అర్థమైపోతోందన్నారు. రెండేళ్లు గడిచినా ఆరు గ్యారెంటీల పేరిట చేసిన సీఎం రేవంత్ మోసం, పెన్షన్ల పెంపు పేరిట చేసిన ద్రోహం, మహాలక్ష్మి పేరిట చేసిన దగా, తులం బంగారం పేరిట చేసిన నయవంచనను గ్రామీణ ప్రాంత ప్రజలు మరిచిపోలేదని పంచాయతీ ఎన్నికల ఫలితాలు తేల్చిచెప్పాయన్నారు. యూరియా బస్తాల కోసం నెలల తరబడి పడిన అగచాట్లను, బోనస్ పేరిట చేసిన బోగస్ హామీని, చివరికి పండించిన పంటను అమ్ముకోలేక పడ్డ కష్టాలను అన్నదాతలు గుర్తుపెట్టుకున్నారని ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. పదేళ్లపాటు ప్రగతిపథంలో సాగిన పల్లెల్లో రెండేళ్లుగా పడకేసిన పాలన, గాడితప్పిన పారిశుధ్యం, చివరికి ట్రాక్టర్లలో డీజిల్ పోయలేని దుస్థితి వంటి అంశాలన్నీ పల్లె ప్రజలను ఆలోచింపజేసినట్టు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

# అఖండ-2 టికెట్ల ధరల పెంపు



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ-2: తాండవం' మూవీ టికెట్ల ధరల పెంపు, ప్రీమియర్ షోల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ సినిమా టికెట్ల ధరల పెంపుపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తనకు తెలియకుండానే టికెట్ల ధరలపెంపుకు సంబంధించిన జీవో విడుదలైందని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. టికెట్ల రేట్లు పెంచొద్దని గతంలోనే అనుకున్నామని ఈ విషయాన్ని అసెంబ్లీలోనే చెప్పామన్నారు. కానీ ఈసారి పొరపాటు జరిగిందన్నారు. శుక్రవారం ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన మంత్రి. గత రాత్రే హోం సెక్రటరీతో తాను మాట్లాడానని ఇకపై టికెట్ల ధరల పెంపు, ప్రీమియర్ షోల విషయంలో ఎలాంటి అప్లికేషన్లు తీసుకోవద్దని, నా దృష్టికి తీసుకురాకుండా ఎవరూ ధరలను పెంచవద్దని ఆదేశాలు ఇచ్చానన్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. ఇకపై సినిమా టికెట్ల ధరలు పెంచేది లేదని నిర్మాతలు, డైరెక్టర్లు ఎవరూ టికెట్ల ధరలు పెంచాలని మా వద్దకు రావొద్దన్నారు. కుటుంబం సినిమాలు చూడాలంటే టికెట్ల ధరలు తగ్గాలని అన్నారు. ఇది ఇందిరమ్మ ప్రభుత్వం పేదల కోసమే మా నిర్ణయాలు ఉంటాన్నారు. హీరోలకు వందల కోట్ల రెమ్యూనరేషన్లు ఎవరు ఇవ్వమన్నారని ప్రశ్నించారు. అయితే అఖండ-2 సినిమా టికెట్ల ధరలు పెంపు, ప్రీమియర్ షోలకు అనుమతి ఇస్తు తెలంగాణ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అయితే ఈ జీవోపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ ధర్మాసనం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. సింగిల్ బెంచ్ తీర్పుపై చిత్ర నిర్మాణ సంస్థ డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసుకుంది. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై ఈనెల 14 వరకు స్టే విధిస్తూ తదుపరి విచారణ ఈ నెల 15కు వాయిదా వేసింది.

# ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణ సులభతరం కోసం ప్రత్యేక పోర్టల్




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణను మరింత సులభతరం చేసి పారదర్శకతను పెంచే దిశగా ప్రత్యేక పోర్టల్ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, పంచాయతి రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖలకు ఏ పథకం కింద ఎంత నిధులు కేటాయించబడ్డాయి, ఏ పనులు చేపట్టారు, వాటి పురోగతి ఎంత, పూర్తి చేయాల్సిన గడువు, ప్రారంభం కాని పనులు, కాంట్రాక్టర్ల సమస్యలు, స్థల సంబంధిత ఇబ్బందులు వంటి అన్ని అంశాలను ఒకే వేదికలో సమగ్రంగా పొందుపరుస్తూ పోర్టల్ రూపొందించామని తెలిపారు. పోర్టల్‌ను పరిశీలించి ఈ ఈలు మూడు రోజుల్లో ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని, ఇచ్చిన సూచనల ఆధారంగా పోర్టల్ కు తుదిరూపం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ పోర్టల్ వల్ల పనుల యొక్క పర్యవేక్షణ సులభతరం అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఇంజినీరింగ్ శాఖకు ప్రత్యేక ఐడీ కేటాయించి పోర్టల్‌లో లాగిన్ అయ్యే సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సలహాలు, సూచనల ఆధారంగా పోర్టల్‌ను మెరుగుపరిచి తుది వెర్షన్ విడుదల చేస్తామని, అనంతరం అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన పనుల వివరాలు, కేటాయించిన నిధులు, పురోగతి వంటి వివరాలను పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్ ఈ ఈ బసవ ప్రసాద్, తిరుపతి రావు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పంచాయతి రాజ్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ శ్వేతా, జాతీయ రహదారుల డీఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహించరాదు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహించరాదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ఎలాంటి ప్రైవేటు ఆసుపత్రులు క్లినిక్ లు నిర్వహించరాదని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఆస్పత్రులను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించాలని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) మార్గదర్శకాల ప్రకారం బయో మెడికల్ వేస్ట్ చార్జీలను ఆస్పత్రుల వద్ద తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య సేవల నిమిత్తం ఆసూపత్రులు, క్లినిక్ లకు వచ్చే రోగులకు రాసే చీటీలో కాంపో జిషన్ తో పాటు మందుల వివరాలు అర్థమయ్యేలా పెద్ద అక్షరాల(క్యాపిటల్ లెటర్స్ తో రాయాలన్నారు. వైద్య సేవల రుసుము తెలిసేలా చార్జీల పట్టిక ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్, డీఎంహెచ్ఓ డా”మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా శ్రీదేవి, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కిరణ్, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు

**ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి .మధుసూదన్**

**జాతర విద్యుత్ పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష**



ములుగు, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): లక్షలాది భక్తులు తరలివచ్చే మేడారం కుంభమేళా జాతరకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి .మధుసూదన్ స్పష్టం చేసారు. శుక్రవారం ములుగు సర్కిల్ పరిధిలోని నార్లాపూర్ కొత్తగా నిర్మాణంలో ఉన్న 33/11 కెవి నార్లాపూర్ సబ్‌స్టేషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. అనంతరం డైరెక్టర్ ఆపరేషన్ టి .మధుసూదన్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్ధేశం చేశారు. ఈ నెల 31వ తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యతలో ఎలాంటి రాజీపడవద్దని, భక్తులకు సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. లక్షలాది భక్తులు వచ్చే ఈ జాతరలో ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, జాతర విజయవంతం కావడానికి విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అందువల్ల ప్రతి పని నాణ్యతతో, సమయానికి పూర్తిగా సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఈ ఆపరేషన్ కెలోత్ రాజు చౌహన్, ములుగు ఎస్ఈ ఆనందం, డి.ఈ ఆపరేషన్ పి . నాగేశ్వర రావు, డి.ఈ కన్స్ట్రక్షన్ సదానందం, పురుషోత్తం, ఏడీఈ లు, వేణుగోపాల్, సందీప్ పాటిల్, రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మూడవ ర్యాండమైజేషన్ పూర్తి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): రెండవ విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 14వ తేదీన జరుగనున్న భూపాలపల్లి, టేకుమట్ల, చిట్యాల, పలిమెల మండలాలల్లో ఎన్నికల విధులు నిర్వహించే పిఓ, ఓపిలకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాన్డమైజేషన్ నిర్వహించినట్లు తెలిపారు మండలం వారిగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ విధులు నిర్వర్తించు పిఓ, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియలో మినహాయింపు కల్పించామని తెలిపారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయించినట్లు ఆయన స్పష్టంచేశార. 20 శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమైజేషన్ జరిపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# యువత నాయకత్వానికి ప్రాధాన్యం

**ఉపసర్పంచ్ గా ఏకగ్రీవం**

**పెరుపల్లి గ్రామచరిత్రలో మొదటి యువతీ ఉపసర్పంచ్ : పల్లవి**



పెద్దపల్లి, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ తొలి దఫా (డిసెంబర్ 11) ఎన్నికల్లో పెరపల్లి గ్రామ 2వ వార్డులో నలుగురు పోటీదారుల మధ్య జరిగిన ప్రజాస్వామ్య పోటీలో ఎరుకల పల్లవి అత్యధిక మెజారిటీ ఓట్లతో ఘనవిజయం సాధించింది. చదువుకున్న యువతికి ప్రాధాన్యత ఇవ్వాలనే భావంతో, గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు అందరూ పల్లవిని గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విశిష్ట అవకాశాన్ని ఇచ్చిన గ్రామ ప్రజలకు, అలాగే తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన ప్రజా నాయకులకు పల్లవి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా నూతన ఆలోచనలతో, పారదర్శక విధానాలతో, యువత శక్తిని వినియోగించుకుంటూ ముందుకు సాగుతానని పల్లవి ప్రకటించారు.


# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**మూడవ ర్యాండమైజేషన్ పూర్తి**



ములుగు జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రెండవ విడతలో ఎన్నికలు జరుగనున్న ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి. ఎస్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ నాటికే ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలతో కూడిన గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నుండి మినహాయింపు కల్పించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. రెండవ విడతలో 462 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు జరుగనుండగా, 20 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమైజేషన్ జరిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి




మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని ఇప్పటి వరకు సహకార ( 172) ఐకెపి (74) గిరిజన కార్పొరేషన్ (13) మెప్మా (1) మొత్తం (260) కేంద్రాల ద్వారా 93 వేల 67 టన్నుల ధాన్యం కొనుగోలను చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, అందుకు సంబంధించి రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి ప్రభుత్వం నుండి (డబ్బులు) పేమెంట్ త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ వెంట వెంటనే వారి వారి ఖాతాలలో డబ్బులు జమ కావడం జరుగుతుందన్నారు, కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేస్తూ ఉన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, జిల్లా కేంద్రం నుండి నిత్యం ఉదయం సాయంత్రం పర్యవేక్షణ ద్వారా సహకార శాఖ, ఐకెపి, గిరిజన కార్పొరేషన్, మెప్మా, స్థానిక తహసీల్దారులు, వ్యవసాయ పౌరసరఫరాల శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షణ ద్వారా ధాన్యం కొనుగోళ్లలో ఇలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకొని ముందుకు సాగుతున్నారు.

# ప్రశాంతంగా మొదటి విడత ఎన్నిక

**రెండవ, మూడవ విడత ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**టీమ్ వర్క్‌తో ఎన్నికలు సజావుగా**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వివిధ శాఖల అధికారుల టీమ్ వర్క్ తో మొదటి విడత ఎన్నికలను సజావుగా ముగిసిందని, ఈ నెల 14,17 వ తేదీన జరిగే రెండు, మూడవ విడత ఎన్నికలను కూడా అదే రీతిలో జరిగేలా పని చేయాలనీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. రెండవ, మూడవ విడత ఎన్నికల నిర్వహణ మీద అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈఓ,తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర పోలింగ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ, మూడవ విడత పోలింగ్ ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను సరిగ్గా నిర్వహించాలని చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్ పంపిణి జరగాలని, పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని, ఓటింగ్ కి సంబందించి ఇచ్చే నివేదిక లన్ని పూర్తి సమాచారం తో ఉండాలన్నారు. వార్డ్, సర్పంచ్ ఎన్నిక కు సంబందించిన బ్యాలట్ పేపర్ రెండిటిని ఓటర్లు బ్యాలట్ బాక్స్ లో వేయాలని అలాగే రెండింటి మీద స్వస్తిక్ గుర్తును ఇంక్ తో పూర్తి గా అంటించి ఓటర్లు పెట్టాలన్నారు. ఈ అంశం మీద అక్కడ ఉండే పోలింగ్ అధికారులు ఓటర్ల కు తెలియజేయాలన్నారు. పోలింగ్ అయిపోగానే రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ జాగ్రత్తగా జరగాలని వేగవంతంగా జరిగేందుకు అవసరమగు సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ కూడా వెంటనే అయిపోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మండల స్పెషల్ అధికారులు సమన్వయముగా పని చేసి పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు.

## బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి



**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

హనుమకొండ జిల్లా, డిసెంబరు 12 (తీన్మార్ న్యూస్): అత్యాచార కేసుల్లో బాధితులకు పరిహారాన్ని సకాలంలో అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్ని అత్యాచార కేసులు నమోదయ్యాయి, ఛార్జ్‌షీట్ చేయడానికి ఎన్నిరోజులు పడుతుంది, ఇప్పటి వరకు ఎన్ని కేసులు పెండింగ్ లో ఉన్నాయి, బాధితులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలను గురించి జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపులో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ప్రతి రెండు నెలలకోసారి కమిటీ సమావేశం కావాలని, ఆ సమావేశంలో చర్చించే అంశాలను ముందస్తుగా తెలియజేయాలన్నారు. అత్యాచార ఘటనలు జరగకుండా అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ నిర్మల, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రేమకళా, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, సీఎంవో సుదర్శన్ రెడ్డి,సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సంజీవ రావు, ఇంచార్జీ డీసీపివో ఎస్ ప్రవీణ్ కుమార్, ఈవో సింధురాణి, డివిఆక్ట్ కౌన్సిలర్ పావని, భరోసా ఎస్సై కే శ్రీలత, పీఎంహెచ్ఎన్ డాక్టర్ రూబీనా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందిర, శైలజ, మరియు మానస, స్వర్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుల వివరాలు నమోదు చేయాలి

**జిల్లా ఎన్నికల ఖర్చుల నోడల్ అధికారి డిసిఓ వెంకటేశ్వర్లు**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని, ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, వాటికి సంబంధించిన రసీదు కూడా జత చేయాలని, ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు జి.శ్రీనివాస్ సూచించారు. పెద్ద వంగర గ్రామ పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచి అభ్యర్థులకు ఎన్నికలు, ఖర్చులపై శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ఖర్చు రూ.5 వేల లోపైతే నేరుగా నగదు ఇవ్వొచ్చని, అంతకు మించితే చెక్కు లేదా ఆర్టీజీఎస్ ద్వారా చెల్లించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తైన 45 రోజుల్లోగా మొత్తం లెక్కలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలకు మించి అధికంగా ఖర్చు చేసినా, తప్పుడు లెక్కలు చూపినా తగిన ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒక పంచాయితీలో అనుమతి తీసుకున్న వాహనంపై మరో పంచాయతీలో తిరిగితే దాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం సూచనల ప్రకారం తనిఖీల నిమిత్తం తెలిపిన తేదీల్లో అభ్యర్థులు విధిగా హాజరు కావాలని తెలిపారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుమతులు తీసుకుని తీసుకోవాలని ప్రకటనల కు సంబంధించిన వ్యయాలను నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. వేణుమాధవ్, తాసిల్దార్ వినోద్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## 14న పోలింగ్ ముగింపు సమయం మధ్యాహ్నం 1 గం. వరకు నిశ్శబ్ద కాలం అమలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన పోలింగ్ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ముగింపు సమయం మధ్యాహ్నం 1:00 గంటల వరకు - నిశ్శబ్ద కాలం అమలు అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రెండవ విడత జనగాం, నర్మేట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలంలో జరిగే ఎన్నికల సందర్భంగా ఈ నెల 14వ తేదీన పోలింగ్ జరగనున్న ప్రాంతాలలో, పోలింగ్ ముగింపు సమయానికి 44 గంటల ముందు నుండి నిశ్శబ్ద కాలం అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 12 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి 14.12.2025 మధ్యాహ్నం 1:00 గంటల వరకు సంబంధిత పోలింగ్ ప్రాంతాలలో కింది తెలిపిన కార్యక్రమాలు పూర్తిగా నిషేధించిన్నట్లు తెలిపారు. ఎటువంటి బహిరంగ సమావేశాలు, సభలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా, సంగీత, నాటక, వినోద కార్యక్రమాల ద్వారా ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 - సెక్షన్ 214(2) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు

## సచివాలయంలో సోలార్ "పార్కింగ్‌కు ముహూర్తం ఖరారు"



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సచివాలయంలో పార్కింగ్ స్థలాల్లో సోలార్ ప్యానెల్స్‌తో కూడిన కార్‌పోర్ట్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా సోలార్ పార్కింగ్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈనెల 15వ తేదీన శంకుస్థాపన భూమిపూజ చేయనున్నారు. నిర్మాణానికి ప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేసింది. నైరుతీ, వాయువ్య విభాగాల్లో వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని కవర్ చేసే సోలార్-ప్యానెల్ పైకప్పు నిర్మాణం చేపట్టనున్నారు. బహుళ-స్థాయి పార్కింగ్ సౌకర్యంతో కానోపీలు ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ, రాష్ట్ర రోడ్లు, భవనాల సంస్థలు సంయుక్తంగా ప్రాజెక్ట్ నిర్మించనున్నారు. సచివాలయం విద్యుత్ అవసరాలను సోలార్ ఎనర్జీతో తీర్చడం, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశ్యం కావడం గమనార్హం.

## యుద్ధ ప్రాతిపదికన "మేడారం జాతర పనులు"

**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**మంత్రి సీతక్క కలిసి అభివృద్ధి పనుల పురోగతి పరిశీలన**




ములుగు, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జనవరి నెలలో ప్రారంభం కానున్న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని, గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సహచర మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెవిస్ శ్రీనివాసరాజు, ఉన్నతాధికారులతో కలిసి జాతర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు నిర్వహించి, అమ్మవార్ల కృపతో అభివృద్ధి పనులలో ఎటువంటి ఆటంకం లేకుండా అనుకున్న సమయానికి ఏర్పాట్లు పూర్తయేలా దీవించమని కోరారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి, ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలు, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ, జంపన్న వాగు వద్ద పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు మరో వందేళ్ల వరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసే విధంగా నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ జాతరకు గిరిజనులు, గిరిజనేతరులు దాదాపు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారు, జాతర ప్రారంభం నాటికి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకువెళ్తున్నట్లు తెలిపారు. జాతర కోసం 50 కిలోమీటర్ల పరిధిలో అన్ని రకాల అభివృద్ధి పనులను భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నాము. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మేడారం ప్రాంగణాన్ని మహా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

## రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు

## 13 లక్షల ఉద్యోగాలు, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అత్యంత విజయవంతంగా జరిగింది. ఈ సమ్మిట్ ద్వారా కొన్ని కీలక ప్రకటనలు, కొత్త భాగస్వామ్యాలు ఏర్పడి రాష్ట్రానికి సుమారు రూ.5,75,000 కోట్ల విలువైన పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అయితే, సోషల్ మీడియా లో కొందరు తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కాలేదు కాబట్టి శుక్రవారం నుండి మూడు రోజులు పాటు హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగాల్సిన యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సమ్మిట్ ను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది అని ప్రచారం చేశారు. అందులో ఎలాంటి నిజం లేదని ప్రభుత్వం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తవం, నిరాధారమైనవని కొట్టిపారేసింది. యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ అనేది సుధా రెడ్డి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఒక ప్రైవేట్ కార్యక్రమం. అందువల్ల ఆ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం లేదు. అలాగే ఆ కార్యక్రమం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కొనసాగింపు కూడా కాదు. ఆ సమ్మిట్ వాయిదా పడటాన్ని ప్రభుత్వంతో ముడిపెట్టడం సరియైనది కాదు అని తెలంగాణ స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ స్పష్టం చేశారు.

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్- ముఖ్యాంశాలు**

- 13 లక్షల కొత్త ఉద్యోగ ఉద్యోగావకాశాలు
- మౌలిక సదుపాయాల అభివృద్ధి
- మూసీ నది అభివృద్ధి
- రక్షణ-ఏరోసైన్స్ హబ్
- కృత్రిమ మేధస్సు రంగాల పురోగతి
- మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనే ప్రధాన లక్ష్యం
- సుమారు 3,000 మందికి పైగా విద్యార్థులు సమ్మిట్‌లో భాగస్వామ్యం

**ప్రధాన అప్‌గ్రేడ్‌లు ఇవి :**

- వృత్తాకార వాటర్ గ్రిడ్
- 100% శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం
- రవాణా సౌకర్యాలు పెంపొందించే కారిడార్లు
- కొత్త మొబిలిటీ వ్యవస్థలు
- ఏకీకృత కమాండ్ సెంటర్లు
- జలవనరుల విస్తృత పునరుజ్జీవనం
- ఇవి సమిష్టిగా వాతావరణ మార్పులను తట్టుకునే, స్థిరమైన పట్టణ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తాయి.
- తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047

తెలంగాణను సమగ్ర వృద్ధికి జాతీయ నమూనాగా మార్చడానికి దీర్ఘకాలిక వ్యూహం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు విద్య, ఆరోగ్య సంరక్షణ, జీవనోపాధి, డిజిటల్ యాక్సెస్, పబ్లిక్ సర్వీసెస్, సామాజిక న్యాయం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన మద్దతు, వివిధ వృత్తులకు కావల్సిన నైపుణ్యాల వంటి సదుపాయాలను సమకూర్చడం, సంప్రదాయ జీవన విధానాలను ఆధునీకరించడం దీని లక్ష్యాలు.

**స్టార్టప్ & ఇన్నోవేషన్ పుష్**

స్టార్టప్ ఎకోసిస్టమ్ ను బలోపేతం చేయడానికి రూ. 1,000 కోట్ల రూపాయల ఫండ్ ఆఫ్ ఫండ్స్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. భారతదేశంలో మొట్ట మొదటి గూగుల్ ఫర్ స్టార్టప్స్ (జిఎఫ్ఎస్) హబ్ ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఉత్పత్తి ఆధారిత, ఆవిష్కరణల నేతృత్వంలోని కంపెనీలను నిర్మించడానికి వ్యవస్థాపకులను ప్రోత్సహించారు. 2034 నాటికి 100 హైదరాబాద్ స్టార్టప్ల యునికార్న్లుగా మారగలవని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం యొక్క రెండు ప్రధాన నిబద్ధతలు సమాజంలో ఉన్న ప్రతి వర్గానికి సమగ్ర అభివృద్ధి అందాలి. రాబోయే తరంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఒక పోటీతత్వంతో కూడిన ఆవిష్కరణల కు, ప్రపంచస్థాయి వ్యవస్థను అభివృద్ధి చేయాలి. అయితే కొందరు దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్న ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మకండని ప్రభుత్వం పేర్కొంది.

## భోజనం వికటించి "44 మంది విద్యార్థులకు అస్వస్థత"



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని చందునాయక్‌తండా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించింది. 44 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. విషమంగా ఉన్న ఆరుగురిని స్థానిక ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అన్నం ఉడకలేదు, కూరలు అస్సలు బాగో లేవు, అదే మీ పిలల్లకైతే ఇలాగే పెడతారా అంటూ ఇటీవలే రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కాలువపల్లి ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ నిర్లక్ష్యం జరిగినా ఊరుకోము అని హెచ్చరికలు జారీ చేశారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రావడం లేదని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## జర్మనీ పార్లమెంట్ బృందంతో "డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ భేటీ"


### తెలంగాణ-జర్మనీ మైత్రి మరింత పటిష్టం కావాలని ఆకాంక్ష

### పెట్టుబడులు పెట్టేవారికి సహకారం అందిస్తామని హామీ



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంట్ బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ బృందాన్ని ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనేక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని, తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఉందని జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూర దృష్టితో సైబర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామని తెలిపారు.

## తెలంగాణలో రాష్ట్రపతి పర్యటన



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 17 నుంచి 22 వరకు తెలంగాణలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ను రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి 'మినిస్టర్-ఇన్-వైటింగ్'గా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికలను రూపొందిస్తోంది.

## భారత పౌరసత్వం వదులుకున్న 9లక్షల మంది

### పార్లమెంటుకు వెల్లడించిన విదేశీ వ్యవహారల మంత్రి

**న్యూఢిల్లీ :** గత ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంటులో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విదేశీ పౌరసత్వాన్ని పొందుతున్న భారతీయుల సంఖ్య మరింత పెరిగిందని.. గడిచిన ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పేర్కొన్నారు.భారత పౌరసత్వం విషయంలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత పౌరసత్వాన్ని వదులుకొనే వ్యక్తుల వార్షిక రికార్డులను ప్రభుత్వం భద్రపరుస్తోందని తెలిపారు. ఆ రికార్డుల ప్రకారం.. 2011-2019 మధ్య 11,89,194 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని తెలిపారు. గత 14 సంవత్సరాల్లో భారత్‌లోని 20 లక్షలకు పైగా ప్రజలు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నట్లు డేటా సూచిస్తోంది. దీంతో విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల కోసం భారత్ యువత నకిలీ గల్ఫ్ ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులై అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల బారిన పడుతున్నారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇటీవల ఇటువంటి కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటిలో చాలావరకు సోషల్ మీడియాలో ఉద్యోగ ఆఫర్లను నమ్మడంతోనే మొదలవుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటివి నివారించడానికి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా విదేశాంగ శాఖ యువతకు అవగాహన కల్పిస్తోందన్నారు. నమోదు కాని ఏజెంట్లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 2025 నాటికి 3,505 నమోదుకాని ఏజెంట్ల వివరాలను ఇ-మైగ్రేట్ పోర్టల్‌లో పొందుపరిచామన్నారు.

## కేంద్రమాజీమంత్రి శివరాజ్ పాటిల్ కన్నుమూత

### సంతాపం తెలిపిన ప్రధాని మోడీ, కాంగ్రెస్ నేతలు



**ముంబై :** కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్, కాంగ్రెస్ సీనియర్ నేత శివరాజ్ పాటిల్ (90) అనారోగ్యంతో కన్నుమూశారు. మహారాష్ట్ర లాతూర్‌లోని నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. శివరాజ్ పాటిల్ లాతూర్ నుంచి ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1935లో జన్మించిన పాటిల్.. మున్సిపల్ కౌన్సిల్ చీఫ్‌గా తన రాజకీయ జీవితాన్ని ఆరంభించారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభలో 10వ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2004-2008 వరకు కేంద్ర హోంమంత్రిగా ఉన్నారు. పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతం అడ్మినిస్ట్రేటర్‌గా కూడా సేవలందించారు. పలు కీలక బాధ్యతలు నిర్వర్తించిన శివరాజ్ పాటిల్ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. కాంగ్రెస్ సీనియర్ నేత శివరాజ్ పాటిల్ మరణం తనను కలచివేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన సంతాపం వ్యక్తం చేశారు. 'శివరాజ్ పాటిల్‌జీ మరణం విచారకరం. ఆయన అనుభవజ్ఞుడైన నాయకుడు. ప్రజా జీవితంలో సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రితో సహా అనేక హోదాల్లో సేవలందించారు. సమాజ సంక్షేమానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. కొన్ని నెలల క్రితమే ఆయన నా నివాసానికి వచ్చారు. ఇంతలోనే ఇలా జరగడం విచారకరం. ఓం శాంతి' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా శివరాజ్ పాటిల్ మరణానికి సంతాపం తెలిపారు.ప్రజా జీవితంలో సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా, లోక్‌సభకు కూడా సేవలందించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శివరాజ్‌పాటిల్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పాటిల్‌తో సన్నిహిత సంబంధం ఉందని, ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయని ఖర్గే ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గొప్ప గౌరవప్రదమైన రాజనీతిజ్ఞుడైన పాటిల్.. కీలకమైన రాజ్యాంగ పార్లమెంటరీ బాధ్యతలను నిర్వర్తించారు. భారతదేశ ప్రజాస్వామ్య సంస్థలకు గణనీయంగా తోడ్పడ్డారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి, ఆయన సమగ్రత, ప్రజాసేవ పట్ల నిబద్ధతను ఆరాధించిన వారందరికీ తీరని లోటు. కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పాటిల్ మృతికి సంతాపం తెలిపారు. పాటిల్ మరణం చాలా హృదయ విదారకమైనది. పార్టీకి పూడ్చలేని నష్టం. ప్రజాసేవ పట్ల ఆయన అంకితభావం, దేశానికి ఆయన చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయి అని రాహుల్ పేర్కొన్నారు.

## పౌరసత్వానికి ముందే ఓటరుగా సోనియా దరఖాస్తు

### కేసులో బలమైన ఆధారాలను సమర్పిస్తారా?

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాలో పేరు చేర్పుపై సీనియర్ కాంగ్రెస్ నేత సోనియా గాంధీకి మంగళవారం ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే దీనికి సంబంధించి ఆధారాలు బయటపడాల్సి ఉంది. అప్పుడే ఆమెపై వచ్చిన ఆరోపణలు రుజువు కాగలవు. బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు మాత్రం సరికాదు. 1983లో భారత పౌరసత్వం రావడానికి మూడేళ్లముందుగానే ఓటర్ల జాబితాలో సోనియా పేరును చేర్చారన్న ఆరోపణపై దర్యాప్తునకు తిరస్కరిస్తూ మెజిస్ట్రేట్ గతంలో ఆదేశాలు ఇచ్చారు. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. సెప్టెంబరు 11న మెజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన రివిజన్ పిటిషన్‌ను ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగె విచారించారు. ఇది చట్టబద్ధంగా సమర్ధనీయం కాదని, సారాంశ లోపంతో కూడిన ఆరోపణలున్నాయని కోర్టు అభిప్రాయపడింది. మేజిస్టీరియల్ కోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అయితే సోనియాకు, పోలీసులకు నోటీసులు జారీ చేసిన తర్వాత, తదుపరి విచారణ నిమిత్తం జనవరి 6వ తేదీకి ఈ అంశాన్ని వాయిదా వేశారు. సెంట్రల్ ఢిల్లీ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది వికాస్ త్రిపాఠి ఈ రివిజన్ పిటిషన్ వేశారు. 1980 జనవరిలోనే సోనియా పేరును న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఓటరుగా చేర్చారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్పటికి ఆమె భారత పౌరురాలు కాదని తెలిపారు. ఈ విషయమై ఫోర్జరీ జరిగిందని, ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని మోసం చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను ప్రియాంకా గాంధి ఖండించారు. దీనిక ఏమైనా ఆధారాలున్నాయా అని ప్రశ్నించారు. ఇది పూర్తిగా అబద్ధమని, ఆమె పౌరసత్వం పొందిన తరువాతే ఓటు హక్కు పొందారని తెలిపారు. 80 ఏళ్ల వయసులో ఆమెపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు.. రాజకీయ దురుద్దేశంతోనే సోనియాను లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు..అయితే పిటిషన్ దారుడు తనవద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టినప్పుడే దీనికి విశ్వసనీయత ఉంటుంది.

# మీరు వాడుతున్న తేనె స్వచ్ఛమైనదేనా..? ఇలా సులభంగా గుర్తించండి..!

తేనెను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల విటమిన్లు, మినరల్స్, పోషకాలకు తేనె నిలయం. పలు అనారోగ్యాలను తగ్గించడంలో, శరీరానికి శక్తినివ్వడంలో తేనెకు అధిక ప్రాధన్యత ఉంది. ఆయుర్వేదంలోనూ తేనెను పలు ఔషధాలతోపాటుగా ఇస్తారు. అయితే ప్రస్తుత తరుణంలో తేనె వాడకం ఎక్కువవడంతో వ్యాపారులు దాన్ని కూడా కల్తీ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు స్వచ్ఛమైన తేనె ఏదో నకిలీ తేనె ఏదో గుర్తించడం కష్టతరమైంది. అయితే పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను ఇట్టే గుర్తించవచ్చు. దీంతో ఆరోగ్యంపై ప్రభావం పడకుండా జాగ్రత్తగా ఉండవచ్చు.

**నీటిలో కలిపితే..**

మీరు కొన్న తేనె అసలుదో, నకిలీదో గుర్తించాలంటే దాన్ని ఒక టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్ నీటిలో వేయాలి. నకిలీ తేనె అయితే వెంటనే నీటిలో కరుగుతుంది. అసలు తేనె గ్లాస్ అడుగు భాగంలోకి చేరుతుంది. అంతే తప్ప నీటిలో అంత త్వరగా కరగదు. అలాగే ఒక కాటన్ బాల్‌ను తీసుకుని దాన్ని తేనెలో ముంచాలి. అనంతరం దానికి అగ్గిపుల్లతో నిప్పు పెట్టాలి. అసలు తేనె అయితే కాటన్ బాల్ మండుతుంది. నకిలీ తేనె అయితే కాటన్ బాల్ మండదు. అదేవిధంగా ఒక తేనె చుక్కను గోరుపై వేసుకోవాలి. ఆ చుక్క గోరుపై అటు ఇటు కదిలితే అది నకిలీ తేనె అన్నమాట. అదే ఆ చుక్క కదలకుండా స్థిరంగా ఉంటే ఆ తేనెను అసలైందిగా భావించాలి.

**నురగ వచ్చిందంటే..**

ఇక సాధారణంగా మొలాసిస్, మొక్కజొన్న పిండి తదితర పదార్థాలను ఉపయోగించి నకిలీ తేనెను తయారు చేస్తారు. ఈ క్రమంలో నకిలీ తేనెను గుర్తించడం చాలా సులభమే అని చెప్పవచ్చు. కొద్దిగా తేనె తీసుకుని దానికి 2, 3 చుక్కల వెనిగర్ ఎస్సెన్స్ కలపాలి. అనంతరం వాటిని బాగా మిక్స్ చేయాలి. ఇలా వచ్చిన మిశ్రమం ఎక్కువగా నురగను



విడుదల చేస్తుంటే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి. ఎందుకంటే నకిలీ తేనె కోసం ఉపయోగించే పదార్థాల్లో చక్కెర కూడా ఉంటుంది. ఇది వెనిగర్‌తో కలిసినప్పుడు నురగలాంటి ద్రవాన్ని ఇస్తుంది. అసలైన తేనె ఇలా నురగను ఇవ్వదు. అలాగే కొద్దిగా తేనెను తీసుకుని బొటనవేలిపై వేయాలి. అనంతరం దాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ తేనె చుక్క వేలిపై చుట్టూ విస్తరిస్తే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి.

**తేనెకు అసలు ఎక్స్‌పైరీ ఉండదు..**

ఇక సాధారణంగా స్వచ్ఛమైన తేనె అయితే అసలు ఎక్స్‌పైరీ ఉండదు. కానీ మనకు మార్కెట్‌లో లభించే తేనెలో కొందరు రసాయనాలు కలుపుతారు. కనుక మనం కొనే తేనెకు ఎక్స్‌పైరీ ఉంటుంది. కానీ సహజసిద్ధంగా కొన్న తేనె అయితే ఎన్ని రోజులు ఉన్నా పాడవదు. రోజులు గడిచే కొద్దీ ఇంకా రుచి పెరుగుతుంది. మార్కెట్‌లో మీరు తేనె కొంటే వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన తేనె అయితే మంచిది. అది కల్తీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలా పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను గుర్తించడంతోపాటు దాన్ని కొనకుండా జాగ్రత్త పడవచ్చు.

# రోజూ ఒక నారింజ పండు తింటే డిప్రెషన్ తగ్గుతుందా?



నారింజ పండ్లలో అనేక పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల వాటిని సూపర్ ఫుడ్ అంటారు. అవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. నారింజ పండ్లను చర్మానికి కూడా మంచివిగా భావిస్తారు. ఈ ప్రయోజనాలతో పాటు, రోజు నారింజ పండ్ల వినియోగం మానసిక స్థితిని మెరుగుపరుస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రోజూ ఒక నారింజ పండు తినడం వల్ల డిప్రెషన్ ప్రమాదం 20 శాతం తగ్గుతుందని ఇటీవల ఓ అధ్యయనంలో తేలింది.

**మానసిక స్థితి ఎలా మెరుగుపడుతుంది?**

నారింజ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి న్యూరాన్ల సరైన పెరుగుదలకు సహాయపడుతుంది. ఇంకా, ఇది కణాల మధ్య కమ్యూనికేషన్‌ను వేగవంతం చేయడానికి ఒక రక్షణ పొరను ఏర్పరుస్తుంది. విటమిన్ సి మెదడులోని కీలక రసాయనాల స్రావాన్ని నియంత్రిస్తుంది. వాటి ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. ఆరోగ్యకరమైన రక్త నాళాలను నిర్వహించడానికి, మెదడు పనితీరును మెరుగుపరచడానికి, వయసు పెరిగే కొద్దీ ఆరోగ్యకరమైన రక్త నాళాలను నిర్వహించడానికి ఇది చాలా అవసరం. నారింజ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉన్నందున, వాటిని తినడం వల్ల విటమిన్ సి రోజువారీ అవసరాన్ని కూడా తీరుస్తుంది. అంతేకాకుండా, మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**నారింజ తినడం వల్ల కలిగే ఇతర ప్రయోజనాలు**

నారింజ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి. ఇంకా, నారింజ పండ్లను తినడం వల్ల మొటిమలకు చికిత్స చేయడంలో, మచ్చలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫలితంగా చర్మం స్పష్టంగా, ప్రకాశవంతంగా ఉంటుంది .

నారింజ పండ్లు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. క్రమం తప్పకుండా తినడం వల్ల కాలానుగుణ ఫ్లూ, బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది.

నారింజ పండ్లను గుండె ఆరోగ్యానికి మంచి పండుగా పరిగణిస్తారు. నారింజ పండ్లలోని పొటాషియం, ఫైబర్ గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.

రోజూ నారింజ పండ్లు తినడం వల్ల ఎముకలు బలపడతాయి. నారింజ పండ్లలో విటమిన్ సి, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడతాయి.

# కాల్షియం లోపం.. ఈ లక్షణాలతో జాగ్రత్త.!

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కాల్షియం చాలా అవసరం. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అన్ని వయసుల వారికి కాల్షియం చాలా అవసరం. బలమైన ఎముకలను నిర్మించడం, గుండెతో సహా కండరాల సంకోచాలను నియంత్రించడం, బలమైన దంతాలు కలిగి ఉండటం లేదా ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడం వంటి వాటికి కాల్షియం చాలా ముఖ్యం. తేలికపాటి కాల్షియం లోపం అలసట లేదా అసౌకర్యాన్ని కలిగించవచ్చు. దీర్ఘకాలిక, తీవ్రమైన లోపాలు గుండె సమస్యలకు దారితీయవచ్చు. కాల్షియం స్థాయిలు పడిపోయినప్పుడు ఈ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయని నిపుణులు అంటున్నారు..

**తిమ్మిర్లు:**

కండరాల నొప్పి, కదలిక సమయంలో తొడలు, చేతుల్లో నొప్పి కలుగుతుంది. ఇందులో చేతులు, పాదాలు, కాలి వేళ్లలో తిమ్మిరి, జలదరింపు కూడా ఉండవచ్చు. కండరాల పనితీరుకు కాల్షియం చాలా ముఖ్యమైనది. కాల్షియం స్థాయిలు తక్కువగా ఉంటే, కండరాలు సరిగ్గా పనిచేయవని నిపుణులు అంటున్నారు.

**అలసిపోయినట్లు అనిపించడం:**

తక్కువ కాల్షియం స్థాయిలు తీవ్రమైన అలసటకు కారణమవుతాయి. ఇందులో శక్తి లేకపోవడం, నీరసం వంటి భావన కూడా ఉంటుంది. ఇది నిద్రలేమికి కూడా దారితీస్తుంది. కాల్షియం లోపం వల్ల తల తిరగడం, మతిమరుపు, గందరగోళం వంటి ప్రమాదం కూడా పెరుగుతుంది.

**పెళుసైన గోర్లు:**

గోళ్లను ఉపయోగించి కాల్షియం స్థాయిలను గుర్తించవచ్చని నిపుణులు అంటున్నారు. శరీరంలో కాల్షియం లేకపోతే, గోళ్లు పెళుసుగా మారుతాయని, గోళ్ల చివరలు విరిగిపోతాయని చెబుతారు.

**దంతక్షయం :**


కాల్షియం పంటి ఎనామిల్‌లో ఒక ముఖ్యమైన భాగం. ఇది ఎనామిల్‌ను రక్షిస్తుంది. తగినంత కాల్షియం లేకపోతే, ఎనామిల్ బలహీనపడుతుందని, దంతక్షయం వంటి సమస్యలకు దారితీస్తుంది. కాల్షియం లోపం వల్ల జుట్టు విరిగిపోయి ముక్కలుగా రాలిపోతుంది. తామర, చర్మం వాపు, దురద లేదా పొడి మచ్చలు సంభవించవచ్చు.

**ఆర్థరైటిస్:**

బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలకు కాల్షియం చాలా ముఖ్యమైనది. దీర్ఘకాలిక కాల్షియం లోపం ఎముకలను బలహీనపరుస్తుందని, ఆర్థరైటిస్ వంటి పరిస్థితులకు దారితీస్తుందని చెబుతారు.

**కాల్షియం కోసం ఏం తినాలి?**

కాల్షియం పొందడానికి మీరు ప్రతిరోజూ కొన్ని ఆహారాలు తినాలని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా పాలు, పెరుగు, జున్ను, సలాడ్, కాలే వంటి ఆకుపచ్చ కూరగాయలు తీసుకోవాలి. బాదం, సోయా ఉత్పత్తులు, టోఫు, జున్ను కూడా తీసుకోవచ్చు. సాల్మన్, సార్డిన్ వంటి చేపలను కూడా తినాలని నిపుణులు సూచిస్తున్నారు.





# డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్ తినవచ్చా?

డయాబెటిస్ పేషెంట్స్ తమ ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తీపి పదార్థాలు అస్సలు తీసుకోకూడదు. ఎందుకంటే, దీని వల్ల ఆరోగ్యం మరింత దిగజారిపోతుంది. శీతాకాలంలో చాలా మంది స్వీట్ కార్న్‌ను తినడానికి ఇష్టపడతారు. కానీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని తినడం ఆరోగ్యానికి మంచిదేనా? స్వీట్ కార్న్ తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

**డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్ తినవచ్చా?**

శీతాకాలంలో, చాలా మంది స్వీట్ కార్న్‌ను ఉడికించి ఉప్పు, కారం వేసుకుని తింటారు. కొంతమంది దీనిని సలాడ్‌లు, కూరగాయలలో కూడా ఉపయోగిస్తారు. ఇది ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరంగా ఉంటుందో అంతే రుచికరంగా ఉంటుంది. స్వీట్ కార్న్‌లో ఇనుము, జింక్, రాగి, మాంగనీస్, సెలీనియం, విటమిన్ సి, విటమిన్లు బి1, బి2, బి3, బి6, ఎ2 వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ పోషకాలన్నీ అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. శరీర పోషక అవసరాలను తీర్చడంలో సహాయపడతాయి.

ఆరోగ్య నిపుణుల ప్రకారం, డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్‌ను మితంగా తినవచ్చు. ఎందుకంటే ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. అయితే, దీనిని ఉడికించిన లేదా కాల్చిన ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలతో మితంగా తినాలని నిపుణులు సూచిస్తున్నారు.

స్వీట్ కార్న్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెరలో ఆకస్మిక పెరుగుదలను నివారిస్తుంది. ఇది శక్తికి మంచి మూలం. బి విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు జీవక్రియను నియంత్రించడంలో సహాయపడతాయి. ఉడికించిన మొక్కజొన్నలో గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



## మళ్లీ ఒలింపిక్స్ బరిలోకి రెజ్లర్ వినేశ్ ఫొగాట్

ప్రముఖ ఇండియన్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ శుక్రవారం కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. తన రిటైర్‌మెంట్‌ను వెనక్కు తీసుకుంటున్నానని, 2028 ఒలింపిక్స్‌లో మెడల్ సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. పారిస్ ఒలింపిక్స్‌లో నిర్దేశిత వెయిట్ కంటే 100 గ్రాములు ఎక్కువ ఉండడంతో వినేశ్ ఫొగాట్ (31 ఏళ్లు)ను అనర్హురాలిగా ప్రకటించి, ఫైనల్‌లో ఆడనివ్వలేదు. రన్నరప్ పతకం కూడా ఇవ్వలేదు. దీనితో ఆమె బరువైన హృదయంతో రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. వాస్తవానికి ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయ మహిళగా వినేశ్ ఘనత సాధించారు. కానీ ఆమె ఒలింపిక్స్ మెడల్ కల పారిస్ ఒలింపిక్స్‌లో చెదిరిపోయాయి. ఈ నేపథ్యంలో దాదాపు 18 నెలల తర్వాత ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఎమోషనల్ పోస్టు పెట్టారు. తన రెజ్లింగ్ కెరీర్‌ను తిరిగి ప్రారంభించే ఆలోచన చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పారిస్ ఒలింపిక్స్‌తో మీ కెరీర్ ముగిసిందా అని చాలా మంది అడుగుతూనే ఉంటారు. చాలా కాలంగా ఈ ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేకుండా పోయింది. నేను నా రెజ్లింగ్ మ్యాట్ నుంచి, ఒత్తిడి నుంచి, అంచనాల నుంచి, చివరికి నా సొంత ఆశయాల నుంచి కూడా దూరంగా ఉండాల్సి వచ్చింది. కానీ ఇన్నేళ్లలో మొదటిసారిగా నేను కాస్త ఊపిరిపీల్చుకోగలిగాను. నా సుదీర్ఘ ప్రయాణంలోని ఎత్తుపల్లాలను అర్థం చేసుకోవడానికి నేను కొంత సమయం తీసుకున్నాను. నేను కెరీర్?లో ఎన్నో ఎత్తులు చూశాను. అందులో ఈ ప్రపంచం ఎన్నడూ చూడని హృదయ విదారకర ఘటనలు, త్యాగాలు ఎన్నో ఉన్నాయి. ఇదంతా చూసిన తర్వాత నేను ఓ సత్యాన్ని తెలుసుకున్నాను. నేను ఇప్పటికీ ఈ రెజ్లింగ్ క్రీడను ప్రేమిస్తున్నాను. నేను ఇప్పటికీ పోటీ చేయాలని అనుకుంటున్నాను. ఇన్నేళ్ల నిశ్శబ్దంలో నేను మరిచిపోయిన ఓ విషయాన్ని మళ్లీ కనుగొన్నాను. అదేమిటంటే 'నాలో ఆ ఫైర్ ఇప్పటికీ ఉంది'. క్రమశిక్షణ, దినచర్య, పోరాటం- అది నా స్వభావంలోనే ఉంది. నేను ఎంత దూరం పయనించినా, అందులో ఒక భాగం రెజ్లింగ్ మ్యాట్‌పైనే ఉండిపోతుంది. అందుకే నేను ఎలాంటి భయాలు లేకుండా, పరిస్థితులకు లొంగిపోకుండా 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్ కోసం సిద్ధమవుతున్నానని తెలిపారు. వినేశ్ ఫొగాట్ గతేడాది హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జులానా నియోజక వర్గం నుంచి పోటీ చేసి 6,000 ఓట్ల తేడాతో గెలిచారు. దీనితో ఆమె ఓ వైపు రాజకీయ జీవితం గడుపుతూనే, మరోవైపు రెజ్లింగ్‌పై దృష్టి సారించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒలింపియన్ వినేశ్ ఫొగాట్, రెజ్లర్ సోమ్‌వీర్ రథీని వివాహం చేసుకున్నారు. వారికి 2025 జులైలో ఒక మగ బిడ్డ జన్మించాడు. ఈ విధంగా చూస్తే, తల్లి అయిన తరువాత తిరిగి బరిలోకి దిగుతున్న ఎలైట్ భారతీయ అథ్లెట్ల జాబితాలో వినేశ్ చేరనున్నారు. వినేశ్ తన తాజా ఇన్‌స్టా పోస్టులో తన చిన్నారి బాబు గురించి కూడా ఓ విషయం చెప్పారు. "ఈసారి నేను ఒంటరిగా నడవడం లేదు. నా కొడుకు కూడా నా జట్టులో చేరుతున్నాడు. అతనే నాకు అతిపెద్ద ప్రేరణ. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో అతనే నా చీర్‌లీడర్" అని అన్నారు.



## ముస్తాక్ అలీ ట్రోఫీలో అదరగొట్టిన నితీష్ కుమార్ రెడ్డి

నితీష్ కుమార్ రెడ్డి సంచలనం సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025 సూపర్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి దుమ్మురేపాడు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్సెస్ మధ్యప్రదేశ్ మధ్య జరిగిన పోరులో కీలకమైన హ్యాట్రిక్ సాధించి ఆంధ్ర జట్టును గెలుపు దిశగా నడిపించాడు. ఆంధ్ర జట్టు కేవలం 112 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించినప్పటికీ.. నితీశ్ కుమార్ రెడ్డి హ్యాట్రిక్ ప్రదర్శనతో మధ్యప్రదేశ్‌ను ఛేజింగ్‌లో ఆదిలోనే దెబ్బతీశాడు. ఆంధ్ర తరఫున ఆడుతున్న నితీశ్ కుమార్ రెడ్డి, మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్‌లోని మూడో ఓవర్‌లో వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు పడగొట్టి తన తొలి టీ20 హ్యాట్రిక్‌ను నమోదు చేసుకున్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌లో బౌలింగ్‌కు వచ్చి, మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్ లోని మూడో ఓవర్‌లో చివరి మూడు బంతులకు వరుసగా వికెట్లు తీసి ఈ ఘనత సాధించాడు. హర్ష్ గాల్వీని ఔవుట్ చేసి వికెట్ల వేట ప్రారంభించాడు. తరువాత బంతికి హర్‌ప్రీత్ సింగ్ భాటియాను కీపర్ క్యాచ్ ద్వారా వెనక్కి పంపాడు. చివరి బంతికి, ఐపీఎల్‌లో ఆర్సీబీ కెప్టెన్‌గా ఉన్న రజత్ పాటిదార్‌ను క్లీన్ బౌల్డ్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. నితీశ్ రెడ్డి ఈ ట్రిపుల్ స్ట్రైక్‌తో మధ్యప్రదేశ్ స్కోరు 14/3గా మారింది.నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లో కూడా రాణించాడు. 112 పరుగుల స్వల్ప స్కోరు వద్ద ఆంధ్ర జట్టు ఆలౌట్ అయినప్పటికీ, నితీశ్ ఆ జట్టులో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. నితీశ్ 27 బంతుల్లో 25 పరుగులు చేసి, ఆంధ్ర జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించడానికి దోహదపడ్డాడు. కాగా నితీశ్ ఈ హ్యాట్రిక్‌కు ముందు, తన టీ20 కెరీర్‌లో 37 మ్యాచ్‌లలో కేవలం 8 వికెట్లు మాత్రమే తీశాడు. 2/17 ఉత్తమ ప్రదర్శనగా ఉంది. ఈ హ్యాట్రిక్‌తో నితీశ్ తన బౌలింగ్ పరాక్రమాన్ని నిరూపించుకున్నాడు.

# అండర్ 19 ఆసియా కప్ 2025లో భారత్ శుభారంభం



అండర్ 19 ఆసియా కప్ 2025 టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసింది. దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆతిథ్య యూఏఈ జట్టును 234 పరుగుల భారీ తేడాతో చిత్తుచేసింది. ఈ విజయంలో వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయి ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైభవ్ సూర్యవంశీ కేవలం 95 బంతుల్లో 171 పరుగులు సాధించగా.. భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 433 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఈ 400 ప్లస్ స్కోరు అండర్-19 వన్డేల్లో భారత్‌కు అత్యధికం కాగా.. అండర్-19 ఆసియా కప్ చరిత్రలోనే అత్యధిక స్కోరుగా నిలిచింది.బీహార్లోని సమస్తిపూర్‌కు చెందిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ, యూఏఈ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన అద్భుతమైన ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్సర్లు, 9 ఫోర్లు బాదాడు. అండర్-19 స్థాయిలో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. వైభవ్ సూర్యవంశీ 30 బంతుల్లో అర్ధ సెంచరీ, కేవలం 56 బంతుల్లో సెంచరీ పూర్తి చేయడం విశేషం. 9 ఫోర్లు, 14 సిక్సర్లతో కూడిన అతని 171 పరుగుల ఇన్నింగ్స్, యూత్ వన్డేల్లో భారత్ తరఫున రెండో అత్యధిక స్కోరుగా నిలిచింది. 2002లో అంబటి రాయుడు ఇంగ్లాండ్‌పై చేసిన అజేయ 177 పరుగులు అగ్రస్థానంలో ఉంది.వైభవ్ ఆరోన్ జార్జ్ (69)తో కలిసి 212 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సూర్యవంశీతో పాటు విహాన్ మల్హోత్రా (69), ఆరోన్ జార్జ్ (69) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆ తర్వాత వేదాంత్ త్రివేది (38), అభిజ్ఞాన్ కుందు (32 నాటౌట్), కనిష్క్ చౌహాన్ (28) ధాటిగా ఆడటంతో భారత్ 400 పరుగుల మార్కును దాటింది.434 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యూఏఈ జట్టు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి, త్వరత్వరగా కీలక వికెట్లు పడగొట్టుకుంది. 48 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే యూఏఈ తరఫున పృథ్వీ మధు (50), ఉద్దిష్ సూరి (78 నాటౌట్) పోరాడి అర్ధ సెంచరీలు నమోదు చేశారు. ఈ ఇద్దరూ కలిసి 85 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పినా, లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఫలితం లేకపోయింది. నిర్ణీత 50 ఓవర్లలో యూఏఈ 7 వికెట్ల నష్టానికి 199 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత్ 234 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టోర్నీని ఆత్మవిశ్వాసంతో ప్రారంభించింది.

**171 పరుగులతో వైభవ్ సూర్యవంశీ ఊచకోత**

దుబాయ్ వేదికగా అండర్- 19 ఆసియా కప్ 2025 ప్రారంభమైంది. టోర్నీ ప్రారంభ మ్యాచ్?లో భారత్-యూఏఈ తలపడ్డాయి. ఈ మ్యాచ్?లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. టీమ్‌ఇండియా చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. 95 బంతుల్లోనే 171 పరుగులు నమోదు చేశాడు. దీంతో భారత్ అరుదైన రికార్డ్ సృష్టించింది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూఏఈ, భారత్?ను మొదట బ్యాటింగ్?కు ఆహ్వానించింది. సూర్యవంశీతోపాటు అరోన్ జార్జ్ (69 పరుగులు), వివాన్ మల్హోత్ర (69 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 433 భారీ స్కోర్ సాధించింది. అండర్ 19 విభాగంలో టీమ్‌ఇండియాకు ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఈ క్రమంలో యువ భారత్ 21ఏళ్ల రికార్డ్‌ను బద్దలుకొట్టింది. ఈ మ్యాచ్‌కు ముందు 2004లో టీమ్‌ఇండియా చేసిన 425 పరుగులు టాప్?లో ఉండేది.ఈ ఏడాది వైభవ్ సూర్యవంశీ అత్యుత్తమ ఫామ్?లో దూసుకుపోతున్నాడు. మ్యాచ్ ఏదైనా, ఫార్మాట్ ఏదైనా, ప్రత్యర్థి ఎవరైనా వైభవ్ మాత్రం అస్సలు తగ్గేదేలే అన్నట్లు ఆడుతున్నాడు. సెంచరీ బాదడమే తన పని అన్నట్లు బంతిని కసితీరా బాదేస్తున్నాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెంతరీతో సత్తాచాటిన అతడు, తాజా మ్యాచ్‌లోనూ శతకంతో మెరిశాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ 55 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకు న్నాడు. ఓవరాల్‌గా 95 బంతుల్లో 171 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్స్‌లు, 9 ఫోర్లు బాదడం విశేషం. రెండో వికెట్‌కు అరోన్ జార్జితో కలిసి వైభవ్ 146 బంతుల్లో 212 పరుగులు జోడించాడు. టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌లో చివర్లో వేదాంత్ త్రివేది (38 పరుగులుబీ 34 బంతుల్లో, 3x4) ఆకట్టుకున్నాడు. అభిజ్ఞాన్ కుందు (32 పరుగులు 17 బంతుల్లో, 3x4, 1x 6), కాన్సిక్ చౌహాన్ (28 పరుగులు 12 బంతుల్లో, 1x4, 3x6) మెరుపులు మెరిపించారు. యూఏఈ జట్టు బౌలర్లలో ఉద్దిశ్ సురి, యుగ్ శర్మ చెరో 2, షలోమ్ డిసౌజ, యాయిన్ రాయ్ తలో 1 వికెట్ తీసుకున్నారు. కాగా, ఈ మ్యాచ్?లో భారత్ 234 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఛేదనలో యూఏఈ ఓవర్లన్నీ ఆడి 7 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. చివర్లో ఉద్దిశ్ సూరి (78ли) రాణించాడు. పృథ్వీ మధు (50) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. టీమ్‌ఇండియా బౌలర్లలో దీప్‌వశ్ 2, కిషన్ కుమార్, హెనిల్ పటేల్, ఖిలాన్ పటేల్, విహాన్ మల్హోత్ర తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

## భారత్ దారుణ ఓటమికి అనేక కారణాలు




తొలి టీ20లో దక్షిణాఫ్రికా జట్టుపై వంద పరుగులకు పైగా తేడాతో నెగ్గిన భారత్ రెండవ T20 మ్యాచ్‌లో 51 పరుగుల తేడాతో ఓడిపోయింది. తెలుగు తేజం తిలక్ వర్మ (62) హాఫ్ సెంచరీ చేసినప్పటికీ, ఇతరుల నుంచి సహకారం లేకపోవడంతో ఇండియాకు ఓటమి తప్పలేదు. దక్షిణాఫ్రికా మొదట బ్యాటింగ్ చేసి 213 పరుగులు చేసింది. అయితే ఛేజింగ్‌కు బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు దారుణంగా విఫలమయ్యారు. గాయం నుంచి కోలుకున్న శుభ్‌మన్ గిల్ డకౌట్ అయ్యాడు. టాస్ గెలిచిన తర్వాత కూడా ఇండియా తప్పుడు నిర్ణయాల కారణంగా ఘోరంగా ఓడిపోయింది.భారత్ మొదటి 2 ఓవర్లలోనే స్టార్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ వికెట్లు కోల్పోయింది. మూడో స్థానంలో అక్షర్ పటేల్‌ను పంపించారు, అతను పవర్‌ప్లేలో అంచనాలను అందుకోలేకపోయాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రెగ్యూలర్‌గా వచ్చినట్లు మూడో స్థానంలో బ్యాటింగుకు వచ్చి ఉంటే, అతని 30- 40 పరుగుల వేగవంతమైన ఇన్నింగ్స్ మ్యాచ్‌కు ప్లస్ అయ్యేది. అక్షర్ నంబర్ 3కి రావడంతో తిలక్ వర్మతో సహా అందరు బ్యాట్స్‌మెన్‌ల స్థానాలు కిందకు జరిగాయి. ఫినిషర్ పాత్ర పోషించే శివమ్ దూబే ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఎవరైతే పవర్ హిట్టర్, స్టార్ బ్యాటర్ కాదో అతడ్ని కీలక స్థానంలో బ్యాటింగ్ కు దింపడంతో మిగతా బ్యాటర్ల స్థానాలు మారాయి. భారత T20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేలవమైన ఫామ్ కంటిన్యూ చేస్తున్నారు. గిల్ ఖాతా తెరవకుండానే డకౌట్ కాగా, సూర్యకుమార్ యాదవ్ కేవలం 5 పరుగులు చేశాడు. ఈ ఏడాది గిల్ ఒక్క T20 అర్ధ సెంచరీ కూడా చేయలేదు. కెప్టెన్ సూర్య T20 సగటు ఈ సంవత్సరం కేవలం 14.4గా ఉంది. గిల్, సూర్యకుమార్ బాధ్యతగా ఆడకపోవడం ఇండియా ఓటమికి ఒక ప్రధాన కారణం.హార్దిక్ పాండ్యా బ్యాటింగ్ చేయడానికి వచ్చినప్పుడు, 7.3 ఓవర్లలో భారత్ స్కోరు 67/4. ఆ సమయానికి భారత జట్టు 12.3 ఓవర్లలో 147 పరుగులు చేయాల్సి ఉంది. అలాంటి సమయంలో ఏ బ్యాటర్ వచ్చినా జట్టు వేగంగా బ్యాటింగ్ చేస్తూ పరుగులు సాధిస్తాడని ఆశిస్తుంది. కానీ హార్దిక్ ఆ సమయంలో చాలా నెమ్మదిగా ఆడాడు. 23 బంతుల్లో హార్దిక్ పాండ్యా 20 పరుగులు చేశాడు. ఇది భారత జట్టుకు మరింత భారంగా మారింది.భారత జట్టు ఓటమికి పునాది మొదటి ఇన్నింగ్స్‌లోనే పడింది. T20 జట్టులోని ఇద్దరు భారత ఫాస్ట్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఘోరంగా విఫలమయ్యారు. వీరిద్దరూ కలిసి ప్రత్యర్థి జట్టుకు 99 పరుగులు సమర్పించుకున్నారు. బుమ్రా 4 ఓవర్లలో 45 పరుగులు ఇవ్వగా, అర్ష్‌దీప్ తన ఓవర్లలో ఏకంగా 54 పరుగులు ఇచ్చాడు. ఓ ఓవర్ లో అయితే అర్షదీప్ ఏకంగా 7 వైడ్ బాల్స్ వేశాడు.అక్షర్ పటేల్ మూడో ఓవర్లోనే, అది కూడా కీలకమైన 3వ స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చాడు. పవర్‌ప్లేలో వచ్చి వేగంగా బ్యాటింగ్ చేయాల్సి ఉండగా, ఇన్నింగ్స్‌లో ఆరో ఓవర్ వరకు 17 బంతులు ఆడిన అక్షర్ పటేల్ కేవలం 13 పరుగులు మాత్రమే చేశాడు. అక్షర్ పటేల్ ఇన్నింగ్స్ వేగాన్ని పెంచలేకపోయాడు. 21 బంతుల్లో 21 పరుగులు మాత్రమే చేయడంతో తరువాత బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. దాంతో మిగతా బ్యాటర్లు కీలక సమయంలో పరుగులు రాబట్టలేకపోయారు.

## ఫామ్‌లో ఉన్న వారిని విస్మరించడం పై బీసీసీఐ సీరియస్

ప్రస్తుతం భారత టీ20 జట్టు ఎంపికలో నిలకడ లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భారత జట్టు హెడ్ కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ టాలెంటెడ్, ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను పట్టించుకోకుండా తనకు నచ్చిన ఆటగాళ్లకు మాత్రమే ప్లేయింగ్ 11 లో ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశంపై బీసీసీఐ అధికారులు కూడా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. గంభీర్ ఎంపికలో అత్యంత వివాదాస్పదంగా మారిన అంశం%ా% సంజు సామ్సన్ లాంటి టాలెంట్ పక్కన పెట్టడం. సంజూ సామ్సన్ 2024 లో వరుసగా 3 సెంచరీలు సాధించి మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, అతనికి నిరంతరం అన్యాయం జరుగుతోందని విమర్శకులు అంటున్నారు. దీనికి విరుద్ధంగా గత 21 టీ20 ఇన్నింగ్స్‌లలో కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయని శుభ్‌మన్ గిల్‌కు మాత్రం నిరంతరం ఓపెనర్‌గా అవకాశాలు ఇస్తున్నారు. దీని వెనుక%ా% 2026 టీ20 వరల్డ్ కప్ తర్వాత భారత జట్టుకు మూడు ఫార్మాట్‌లకు ఒకే కెప్టెన్‌ను నియమించాలనే బీసీసీఐ ఆలోచన ఉండవచ్చని సమాచారం. బ్యాట్స్‌మెన్ల ఎంపిక మాత్రమే కాక, బౌలర్ల ఎంపికపైనా విమర్శలు వస్తున్నాయి. యువ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఆస్ట్రేలియా సిరీస్, ఆసియా కప్ వంటి ముఖ్యమైన మ్యాచ్‌లలో పక్కన పెట్టి, అతని స్థానంలో హర్షిత్ రాణాకు నిరంతరం అవకాశాలు ఇచ్చారు. హర్షిత్ రాణా నిలకడగా ఎక్కువ పరుగులు ఇచ్చినా, అర్ష్‌దీప్‌ను కేవలం బ్యాకప్ బౌలర్‌గా మాత్రమే ఉపయోగించడంపై బీసీసీఐ అధికారులు గంభీర్‌ను సూటిగా ప్రశ్నించారు. ఫామ్‌లో ఉన్న అర్ష్‌దీప్‌ను పక్కన పెట్టడం చాలా చెత్త సెలక్షన్ అని ఒక బీసీసీఐ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుదీర్ఘ విరామం తర్వాత సౌతాఫ్రికా సిరీస్‌లో అర్ష్‌దీప్‌ను ఆడిస్తున్నా, అతను పవర్‌ప్లేలో బాగా వేసినా, ఆ తర్వాత ఇబ్బంది పడుతున్నాడు. ఫామ్‌లో ఉన్నప్పుడు అతనికి ఇచ్చిన విరామమే ఈ సమస్యకు కారణమని భావిస్తున్నారు. ఈ కారణాలన్నీ దృష్టిలో ఉంచుకుని, ఒకవేళ టీమిండియా సౌతాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌ను కోల్పోతే, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సరిహద్దుల్లో సర్జికల్ స్ట్రైక్స్

## అఖండ-2లో బాలయ్య శివతాండవం



బాలకృష్ణకథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన 'అఖండ' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. అఘోరగా బాలకృష్ణ నటన, తమన్ సంగీతం, బోయపాటి టేకింగ్ సినిమాను విజయ పథంలో నడిపాయి. ఆ చిత్రానికి కొనసాగింపుగా ఇప్పుడు 'అఖండ2: తాండవం' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. టిబెట్ సరిహద్దుల్లో మొదలయ్యే కథ ఇది. శత్రుదేశమైన చైనాకు చెందిన ఆర్మీ అధికారులు మన భారతీయుల నమ్మకాల్ని దెబ్బకొట్టాలని కుంభమేళాని లక్ష్యంగా చేసుకుని బయోవార్‌కి దిగుతారు. వాళ్లు తలపెట్టిన కుట్రతో కుంభమేళాలో పవిత్రస్నానం చేసిన చాలామంది కొన్ని నిమిషాల వ్యవధిలోనే అపస్మారక స్థితికి చేరుకుంటుంటారు. అందుకు విరుగుడుగా డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తలు యాంటీ డాట్ వాక్సిన్‌ని కనిపెడతారు. అది తెలుసుకున్న శత్రువులు ల్యాబ్‌ని నాశనం చేసి, శాస్త్రవేత్తలందరినీ చంపేస్తారు. ఆ బృందంలో ఉన్న యువ శాస్త్రవేత్త జనని (హర్షాలీ మల్హోత్రా) ఒక్కరే వ్యాక్సిన్‌తో బయటపడుతుంది. అది పసిగట్టిన శత్రవులు ఆమెని వెంటాడతారు. ఆమెని రక్షించేందుకు రుద్ర సికిందర్ అఘోరా (బాలకృష్ణ) రంగంలోకి దిగుతాడు. జనని ఆపదలో ఉన్న విషయం అఘోరాకి ఎలా తెలిసింది? శత్రువుల్ని అఘోరా ఎలా ఎదిరించి, భారతదేశం, సనాతన హైందవ ధర్మం గొప్పతనాన్ని ఎలా చాటి చెప్పారు? జననికీ, అనంతపురం ఎమ్మెల్యే బాల మురళీకృష్ణ (బాలకృష్ణ)కీ సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ఈసారి కథని సరిహద్దులు దాటించారు దర్శకుడు బోయపాటి శ్రీను. అఘోరా పాత్రకు మరింత డోస్ పెంచి బాలకృష్ణతో సర్జికల్ స్ట్రైక్ చేయించారు. సనాతన ధర్మం, భారతీయుల నమ్మకాలు, వేదజ్ఞానాల గొప్పతనాన్ని అఘోరా పాత్రలోని బాలకృష్ణతో చెప్పిస్తూ సినిమాని నడిపించారు. మాస్ హీరోల్ని చూపించడంలో బోయపాటి శైలే వేరు. ఆయనకు బాలకృష్ణ తోడయ్యారంటే ఇక వెనక్కి తిరిగి చూసుకోరు. శివుడు పూనిన అఖండ పాత్ర కావడంతో బోయపాటి శ్రీను తనలోని మాస్ ఎలివేషన్లు మరింత పదునెక్కాయి. అయినా అక్కడ అఖండ పాత్ర కావడంతో నమ్మాల్సిందే అన్నట్టుగా ఉంటాయి ఆ సన్నివేశాలు. ఒకపక్క యాక్షన్... మరోవైపు పదునైన సంభాషణలతో సినిమాని నడిపించిన తీరు మెప్పిస్తుంది. అభిమానులకైతే థియేటర్లలో పూనకాలే. అంచనాలకి ఏమాత్రం తీసిపోకుండా సాగే సినిమా ఇది. అఖండ రీక్యాప్‌తో ఈ సినిమా మొదలవుతుంది. అక్కడి నుంచి టిబెట్ సరిహద్దుల దగ్గర సంఘ-ర్షణ.. దేవుడిపై భారతీయులకు ఉండే నమ్మకంపైన దెబ్బ కొట్టాలని శత్రుదేశమైన చైనా పన్నాగం పన్నడం కోసం ఎలాంటి వ్యూహాల్ని రచించారు అన్నది సినిమాలో కీలకం. దీంతో ఎక్కువశాతం 'అఖండ' టెంప్లేట్‌లోనే సాగుతుంది. తొలి భాగంలో ఫ్యాక్షనిస్టులపై యుద్ధం చేస్తాడు మరో బాలకృష్ణ. ఇందులోనేమో మత్తు మందుల్ని సరఫరా చేసే అంతర్రాష్ట్ర ముఠాపై సమర శంఖం పూరిస్తాడు. బాలమురళీకృష్ణ పరిచయ సన్నివేశాలు, ఎలివేషన్లు మాస్ ప్రేక్షకులకు పండగే. ఆ తర్వాత సన్నివేశాలే కాస్త సాగదీతగా అనిపిస్తాయి. విరామానికి ముందు ఎపిసోడ్‌తో సినిమా మళ్లీ గాడిలో పడుతుంది. అఘోరా ప్రవేశంతో థియేటర్ దద్దరిల్లిపోతుంది. ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధం మరింత హైలైట్. బాలయ్య అసలు సిసలు తాండవం విరామం తర్వాతే మొదలు పెడతాడు. అఘోరా పాత్రలోని రెండు కోణాలూ తెరపై కనిపించి ప్రేక్షకుల్ని అలరిస్తాయి. తాంత్రికుడైన నేత్ర ఎపిసోడ్ మొదలుకొని హనుమాన్, శివుడు ఎపిసోడ్స్ సహా తల్లి సెంటిమెంట్, దేశభక్తి, హైందవధర్మం నేపథ్యం వరకూ దాదాపుగా ప్రతీ సన్నివేశం రోమాంచితమే. ముఖ్యంగా తల్లి దగ్గర సన్నివేశాల్లో మలుపు భక్తిని, భావోద్వేగాల్ని పంచుతుంది. సర్జికల్ స్ట్రైక్ అంటూ సరిహద్దుల్లో శత్రుసైన్యంతో తలపడే సన్నివేశాలు, వేదభూమి అయిన భారతదేశం గొప్పతనం గురించి చెప్పే సన్నివేశాలు సినిమాకి ప్రధానబలం.



## వారణాసి తరవాత మహేశ్‌తో వంగా డైరెక్షన్?



సూపర్ స్టార్ కృష్ణ నట వారసుడిగా టాలీవుడ్‌లో అడుగుపెట్టిన మహేష్ బాబు, తొలి సినిమాతోనే తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలో ఉన్న అగ్రశ్రేణి స్టార్స్‌లో ఒకరిగా తన స్థానం పటిష్టం చేసుకున్నాడు మహేష్. ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ వరల్డ్ సినిమా 'వారణాసి'తో ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చూపించేందుకు సన్నద్ధమవుతున్నారు.. 'వారణాసి'తో వచ్చే ఇమేజ్‌ను నిలబెట్టుకోవడానికి తన తదుపరి కెరీర్ ఎలాన్‌ను మహేష్ అత్యంత జాగ్రత్తగా రూపొందిస్తున్నాడు. బాలీవుడ్ నుంచి పలువురు టాప్ డైరెక్టర్లు మహేష్ కోసం కథలు సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుతం ఆయన ఎవరి కథనూ వినట్లేదని తెలిసింది. ఇదిలా ఉండగా, ఒకప్పుడు సందీప్ రెడ్డి వంగా ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తుందని అనుకున్నా కూడా ఆ సినిమా అనుకోని కారణాల వల్ల ఆగిపోయింది. అయితే ఇప్పుడు ఆ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయ్యే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రభాస్‌తో స్పిరిట్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న సందీప్ రెడ్డి వంగా, మహేష్ కోసం గతంలో చెప్పిన కథను మళ్లీ తీసుకొచ్చినట్లు సమాచారం. మహేష్ ,ఆయన భార్య నమ్రత కలిసి ఆ కథను పూర్తిగా చర్చించి, మహేష్ ఇమేజ్‌కి ఇది బాగా సరిపోతుందని భావించినట్టు తెలుస్తోంది. దీంతో సందీప్‌ను పిలిపించి సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ నడుస్తోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావడానికి ఇంకా కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.

## 3 రోజెస్..వెబ్ సీరిస్ రెండో సీజన్ రెడీ




తెలుగు ఓటీటీ 'ఆహా' లో సూపర్ హిట్ అయిన '3 రోజెస్' వెబ్ సిరీస్ ఇప్పుడు రెండవ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సీజన్ 2 ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మొదటి సీజన్‌లో ఇషా రెబ్బా, పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ సీజన్ 2లో ఇషా రెబ్బాతో పాటు రాశీ సింగ్ మరియు కుషిత కల్లపు కొత్త 'రోజెస్'గా కనిపించనున్నారు. కమెడియన్ వైవా హర్షతో పాటు సత్య కూడా నవ్వులు పూయించడానికి రెడీగా ఉన్నారు. ఎస్.కె.ఎన్ నిర్మాణంలో, కిరణ్ కారవల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ డిసెంబర్ 13 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ ట్రైలర్‌ను మీరు కూడా చూసేయండి. ఈ వెబ్ సిరీస్‌కు కిరణ్ కె కరవళ్ళ దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్కేఎన్ నిర్మిస్తున్నాడు.



## దివి బికినీ బ్లాస్ట్

బిగ్ బాస్ బ్యూటీ దివి వాద్యా అంటే మనందరికీ ఒక క్యూట్ ఇమేజ్ మైండ్ లో ఉంది. ఆమె నవ్వు, మాటతీరు, పద్ధతిగా కనిపించే డ్రెస్సింగ్ స్టైల్ ఆమెకు ఒక ప్రత్యేకమైన ఫాలోయింగ్ ను తెచ్చిపెట్టాయి. కానీ నిన్న ఆమె తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఒక్కసారిగా సర్ ప్రైజ్ అయ్యారు. గతంలో కూడా గ్లామరస్ గా కనిపించింది. కానీ ఈసారి అంతకుమించి అనేలా షాక్ ఇవ్వడం వైరల్ అవుతోంది. ఎప్పుడూ లేనిది దివి ఇంత బోల్డ్ గా కనిపించడం వెనుక కారణం ఏంటా అని అందరూ చర్చించుకుంటున్నారు.సముద్ర తీరంలో బ్లూ కలర్ బికినీలో ఆమె దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. అయితే, దీన్ని అందరూ చూస్తున్నట్లుగా కేవలం ఒక 'గ్లామర్ షో' లాగానో, లేక సినిమా అవకాశాల కోసం విసిరిన గాలం లాగానో చూడలేం. ఈ ఫోటోలలో ఆమె బాడీ లాంగ్వేజ్ గమనిస్తే ఒక కొత్త విషయం అర్థమవుతుంది. ఇది సినిమా ఇండస్ట్రీకి పంపుతున్న సిగ్నల్ కంటే, తనకు తాను చెప్పుకుంటున్న ఒక స్టేట్ మెంట్ లా ఉంది. ఇన్నాళ్లు తన చుట్టూ ఫ్యాన్స్ గీసిన 'హెూమ్లీ' అనే గీతను చెరిపేసుకుని, తన సొంత వ్యక్తిత్వాన్ని స్వేచ్ఛగా ప్రకటిస్తున్నట్లుంది. నా శరీరం, నా ఇష్టం, నా కాన్ఫిడెన్స్ అని ధైర్యంగా ప్రపంచానికి చాటిచెబుతున్నట్లుగా ఆమె ఆటిట్యూడ్ కనిపిస్తోంది. ఒక సెలబ్రెటీగా, ఇన్ని రోజులు ఒక ఇమేజ్ లో ఉండి, హఠాత్తుగా ఇలాంటి ఫోటోలు షేర్ చేయాలంటే చాలా ధైర్యం కావాలి. జనం ఏమనుకుంటారో, ట్రోల్ చేస్తారేమో అనే భయాలను పక్కనపెట్టి, తనకు నచ్చినట్లుగా, తాను కంఫర్టబుల్ గా ఉ ండటంలోనే అసలైన ఆనందం ఉందని ఆమె నిరూపిస్తోంది. ఇది ఇతరులను మెప్పించడానికి కాకుండా, తన కోసం తాను తీసుకున్న నిర్ణయంలా ఉంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463